క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వివరాలు అడుగుతున్న ఏఎస్సై దిగంబర్

లోకేశ్వరం: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్సై దిగంబర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ వాహనదారులు అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. వారి వెంట పోలీసులు ఉన్నారు.

కడెం ఎంపీవోగా ఉపేందర్

కడెం: మండల పంచాయతీ అధికారి(ఎంపీవో)గా ఉపేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్ ఎంపీవోగా విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో జెడ్పీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉపేందర్ డెప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా హసీబ్



కడెం: బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా మండల కేంద్రానికే చెందిన ఎండీ హసీబ్ నియమితులయ్యారు. శుక్రవారం ఖానాపూర్‌లోని తమ నివాసంలో ఎమ్మెల్యే రేఖానాయక్ దంపతులు హసీబ్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.

12 వరకే మక్కల కొనుగోళ్లు

ముధోల్: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బిద్రెల్లి ఆధ్వర్యంలో గోదాంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ఈనెల 12వ తేదీ వరకే మొక్కజొన్న పంట కొనుగోలు చేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు సోమవారంలోగా మక్కలను కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించాలని సూచించారు.

ముధోల్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

ముధోల్: ముధోల్‌లో డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా.. కనీసం ముధోల్‌లో కాలేజీని ఏర్పాటు చేయలేదన్నారు. కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలనను అంతం చేసి ముధోల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు.

బోనాల జాతర



మంగళహారతులతో మహిళలు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ పురవీధుల గుండా ఆట, పాటలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈనెల 9 నుంచి 13వరకు ఉత్సవాలు సాగుతాయని పెద్దలు పేర్కొన్నారు.

‘కుటుంబాన్ని ఆదుకోవాలి’

భైంసాటౌన్: వడదెబ్బతో మృతి చెందిన సివిల్ సప్లయ్ హమాలీ షేక్ అస్లం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ కోరారు. ఈ మేరకు కుభీర్ మండలం లింగి గ్రామంలో బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. అస్లం కుటుంబానికి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించడంతోపాటు విధి నిర్వహణలో మృతి చెందినందున రూ.20లక్షలు అందించాలని కోరారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

నిర్మల్‌టౌన్: భక్తి భావనలతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీలో లక్ష్మీనరసింహస్వామి ఆలయ 19వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నంది విగ్రహాల ప్రతిష్ఠాపన, హోమం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం వేద పండితులు నిమ్మగడ్డ సుదర్శన్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు దేవేందర్‌రెడ్డి, పట్టణ సీఐ మల్లేశ్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురొత్తంరెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంవత్సరం.. సరికొత్తగా

- నూతన విద్యా ప్రణాళిక ఖరారు
- రోజూ స్కూళ్లలో యోగా, ధ్యానం
- నాలుగో శనివారం నో బ్యాగ్ డే



నిర్మల్‌రూరల్: నూతన విద్యా సంవత్సరం సరికొత్తగా ఉండబోతోంది. ఈమేరకు ప్రభుత్వం ఎడ్యుకేషన్ అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించింది. 12వ తేదీ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. 2024 ఏప్రిల్ 24 న చివరి పని దినం ఉంటుంది. 2023– 24 విద్యా సంవత్సరంలో మొత్తం 229 వర్కింగ్ డేస్ ఉండనున్నాయి. ప్రతీరోజు పాఠశాలల్లో రోజు 5 నిమిషాలు యోగా, ధ్యానం (మెడిటేషన్) విద్యార్థులతో చేయించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతీనెల నాలుగో శనివారం నో బ్యాగ్ డేగా పాటించనున్నారు. ఏడాదిలో మొత్తం పది రోజులు విద్యార్థులు పుస్తకాల సంచి లేకుండా బడికి వస్తారు. ఆరోజు వారితో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న దానిపై ప్రభుత్వం త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనుంది. టీవీ పాఠాలు ప్రతీరోజు యథావిధిగా ప్రసారం చేస్తారు. ప్రతీరోజు విద్యార్థులతో పాఠ్య పుస్తకాలుగానీ, దినపత్రికలు గానీ 30 నిమిషాలు తప్పక చదివించాలి. దీనివల్ల విద్యార్థుల్లో విద్యా సంబంధిత విషయాలే కాకుండా జనరల్ నాలెడ్జ్, లోకజ్ఞానం అలబడుతుందని విద్యాశాఖ భావిస్తోంది. అలాగే వారానికి మూడు నుంచి ఐదు పీరియడ్లు ఆటలకు కేటాయించాలి. గత సంవత్సరం పాఠశాలలు తెరిచిన 16 రోజుల తర్వాత విద్యాసంవత్సర అకాడమిక్ క్యాలెండర్ విడుదల చేయగా ఈసారి పాఠశాలల పునః ప్రారంభానికి వారం ముందే విడుదల చేయడం విశేషం.

నెలవారీగా పనిదినాలు..

ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలలు జూన్ నెలలో 16 రోజులు పనిచేస్తాయి. జూలైలో 23, ఆగస్టు–25, సెప్టెంబర్–22, అక్టోబర్–14 ,నవంబర్–24, డిసెంబర్– 23, జనవరి–20, ఫిబ్రవరి–24, మార్చి–23, ఏప్రిల్ నెలలో 15 రోజులు పనిచేస్తాయి. ఇక ప్రతీనెల మూడో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి. ప్రతీనెల మొదటివారంలో పాఠశాల విద్యాకమిటీ సమావేశాలు జరగాలి.

ఆపత్కాలంలో బాధితులకు అండ

- మృతుడి కుటుంబానికి రూ.లక్ష సమకూర్చిన పూర్వ విద్యార్థులు



సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లీ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో పని చేసే డి.భూషన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు పూర్వవిద్యార్థులు జమ చేసిన రూ.లక్షా వెయ్యిని ఆర్థికసాయంగా మృతుడి కుటుంబసభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు అందజేశారు. శుక్రవారం భూషన్ స్వగ్రామమైన తానూరు మండలం హంగిర్గా గ్రామంలో బాధిత కుటుంబసభ్యులకు అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు భోజన్న తెలిపారు.

చేపప్రసాదం పంపిణీకి స్పందన



ప్రసాదం అందిస్తున్న సగ్గం సోదరులు

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలో సగ్గం సోదరులు సగ్గం కృష్ణ, లింగం అందించే చేప ప్రసాదానికి స్పందన లభించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లాతో నిజామాబాద్, కరీంనగర్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. సగ్గం సోదరులు మృగశిర కార్తె ప్రవేశ సమయం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభించారు. సుమారు 5వేల మంది ఆస్తమా, ఉబ్బసం వ్యాధిగ్రస్తులు క్యూలో నిలబడి చేపమందు వేయించుకున్నారు. స్థానిక మత్స్యకారులు రెండు రోజుల ముందు నుంచే చేపల వేట ప్రారంభించి అవసరమైన చిన్నచిన్న చేపలను సమకూర్చారు. గ్రామాభివృద్ధి కమిటీ, సర్పంచ్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: అన్నివర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ సంక్షేమ సంబురాలను పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు అన్ని వర్గాలకు ప్రభుత్వం అభివృద్ధిలో చేయూతనిస్తుందన్నారు. ఈసందర్భంగా కులాంతర వివాహం చేసుకున్న ముగ్గురికి మంజూరైన చెక్కులను అందజేశారు. అనంతరం మండలంలోని సుర్జాపూర్‌కు చెందిన 18మంది యాదవులకు గొర్రెల యూనిట్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, కలీల్, మోహిద్, పుప్పాల శంకర్, గొర్రె గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, శ్రీనివాస్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

తమను పట్టించుకోలేదని యాదవుల ఆందోళన..

రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీసుకెళ్లిన పశువైద్యాధికారులు అక్కడ లాడ్జీల్లో ఉంటూ తమను పట్టించుకోలేదని మండలంలోని సుర్జాపూర్‌తోపాటు పలు గ్రామాల యాదవులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగు రోజులు తిరిగినా సరైన గొర్రెలు లేకపోవడంతో ఖాళీగా తిరిగి రావాల్సి వచ్చిందని వాపోయారు. ఈ విషయమై అక్కడే ఉన్న మండల పశువైద్యాధికారి దీప్తితో వాగ్వాదానికి దిగారు. గొర్రెలు కాకుండా నగదును తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో శుక్రవారం పిడుగుపాటుతో గేదె మృతి చెందింది. గ్రామంలోని నాలం భూమన్నకు చెందిన గేదె మేత కోసం పొలాల్లోకి వెళ్లగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందింది. రూ.80వేల విలువైన గేదె మృతి చెందిందని.. తనకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

తానూరు: మండల కేంద్రంలో పంగి లక్ష్మణ్‌కు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. లక్ష్మణ్ గురువారం తన ఇంటి ముందు గేదెను కట్టేశాడు. రాత్రి ఈదురుగాలులకు విద్యుత్ తీగలు గేదెపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

బస్సుల్లేక ప్రయాణికుల కష్టాలు



భైంసా బస్టాండ్‌లో నిజామాబాద్ వెళ్లే బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

భైంసాటౌన్: మంచిర్యాలలో శుక్రవారం సీఎం కేసీఆర్ సభ ఉండడంతో భైంసా డిపో నుంచి దాదాపు 30 వరకు బస్సులను తరలించినట్లు తెలిసింది. ఈ విషయం ప్రయాణికులకు తెలియకపోవడంతో బస్సుల కోసం బస్టాండ్‌లో గంటల తరబడి పడిగాపులు కాశారు. రాత్రివేళ ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారు సొంతూళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక అవస్థలు పడ్డారు. ఇటీవల నిర్మల్ సభకు కూడా ఇలానే బస్సులు తరలించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్సులు లేని సమయంలో తమకు సమాచారం ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై వివరణ కోసం డీఎంను ఫోన్‌లో సంప్రదించగా వారు స్పందించలేదు.

ప్రయాణికులకు ఆర్టీసీ మరింత చేరువ



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ప్రయాణికులకు మరింత చేరువ కావడానికి ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్ డిపోలో శుక్రవారం ‘విలేజ్ బస్ ఆఫీసర్’ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. గ్రామ సభలలో పాల్గొని గ్రామస్తుల సలహాలు, సూచనలు తీసుకుని వారికి అనుకూలంగా, సమస్యలు రాకుండా సేవలు అందించాలని సూచించారు. ఆదిలాబాద్ రీజియన్‌లో మే నెలలో నిర్మల్ డిపోకు రూ.1.07 కోట్ల లాభం వచ్చిందని తెలిపారు. డిపో మేనేజర్ సాయన్న మాట్లాడుతూ నిర్మల్ డిపో పరిధిలో ప్రస్తుతం 10 మంది విలేజ్ బస్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామలకు నియమిస్తామన్నారు. వీరు నెలలో రెండుసార్లు గ్రామాన్ని సందర్శించి ఆర్టీసీ ప్రవేశపెడుతున్న పథకాలను ప్రయాణికులకు వివరిస్తారని పేర్కొన్నారు. శుభకార్యాలకు బస్సులు అద్దెకివ్వడం, ఆన్‌లైన్ సేవలు, సీజన్ టికెట్లు, రూట్ పాసుల కోసం ప్రయాణికులు వీరి సహాయం తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్లు రాజశేఖర్, శ్రీకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ తెలిపారు. రాజీ పడదగు క్రిమినల్ కేసులు, సివిల్, భూతగదా, చెక్‌బౌన్స్, చిట్‌ఫండ్, బ్యాంక్ సంబంధిత కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

గిరిజన బంధు ఇవ్వాలి

ఖానాపూర్: సీఎం కేసీఆర్ హామీ మేరకు గిరిజనులకు రూ.10లక్షలతో గిరిజనబంధు వెంటనే ఇవ్వాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్య గోవింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఖానాపూర్‌లోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎందరో గిరిజనులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం గిరిజన బంధు ఇస్తే గిరిజనులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగే అవకాశాలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు భూక్య రాజేశ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

వర్షాధార భూముల సర్వే



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శుక్రవారం వర్షాధార సాగు భూముల వివరాలను మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ప్రవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 10 నుంచి 15 ఎకరాలు వర్షాధార సాగు భూమి ఉంటే.. న్యూవెల్మల్‌లో మాత్రం అధికంగా 50 ఎకరాల వరకు ఉందన్నారు. ఆయిల్‌పాం పంట సాగు చేయాలని సూచించారు. ఎంపీటీసీ అంకుల నాగయ్య, వీడీసీ సభ్యులు రె మ్మాయి సాగర్, రవి పాల్గొన్నారు.

వరికొయ్యలకు నిప్పు

లోకేశ్వరం: మండలంలోని రాసూరలో కురుమవాడ సమీపంలో పొలంలో వరికొయ్యలకు గుర్తు తె లి యని వ్యక్తులు నిప్పుపెట్టారు. మంటలు తీవ్రమవడంతో స్థానికులు సర్పంచ్ ముత్తగౌడ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన పంచాయతీ వాటర్ ట్యాంకర్ తీసుకొచ్చి మంటలను ఆర్పి వేయించారు.

సంక్షేమంలో నంబర్‌వన్‌గా రాష్ట్రం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరిట 14,784 మంది లబ్ధిదారులకు రూ.134 కోట్ల వరకు లబ్ధి చేకూరిందన్నారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. బీసీ కులవృత్తులను ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ రూ.లక్ష ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్థికసాయం దరఖాస్తుకు ఆన్‌లైన్ గడువు పెంచాలని, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించేలా చూడాలని రజక సంఘం నాయకులు సుంకెట పోశెట్టి ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తెచ్చారు. జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్వో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్లు, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్‌చైర్మన్ సుదర్శన్‌పటేల్, బీఆర్‌ఎస్ నాయకులు భీంరావు, బుచ్చన్న, రమేశ్, సురేందర్‌రెడ్డి, భోజన్న, శంకర్ చౌహన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ఓలాలో నీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సర్పంచ్ కనీష్ ఫాతిమా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఓలా గ్రామంలో డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డ్రమ్ములు, పాతటైర్లలో ఉన్న మురికి నీటిని పారబోయించారు. హెల్త్ అసిస్టెంట్ ఎస్‌వీఎస్ ప్రసాద్, ఏఎన్ఎం సుజాత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్, పొట్టపెల్లి, లక్ష్మణచాంద గ్రామాల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది ఇంటింటా తిరుగుతూ ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. నిల్వ నీటితో దోమలు పెరిగి రోగాల బారిన పడే అవకాశం ఉందని అవగాహన కల్పించారు. బాబాపూర్ సర్పంచ్ శ్రీవిద్య, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి



కుభీర్‌లో మాట్లాడుతున్న లింబాద్రి

భైంసారూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందించే నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ పార్టీ నాయకులు రామారావుపటేల్ అన్నారు. మహాజన సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చుచుంద్, పాంగ్రి, మంజ్రి గ్రామాల్లో పర్యటించి బీజేపీ జెండా ఆవిష్కరించారు. భైంసా మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, మిర్జాపూర్ ఎంపీటీసీ రజాక్, ఇలేగాం సర్పంచ్ ముత్యం, మండలాధ్యక్షుడు భూమేశ్, హన్మాండ్లు, బాలాజీ పటేల్ తదితరులు ఉన్నారు.

కుభీర్‌లో..

కుభీర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గాజుల లింబాద్రి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓబీసీ కార్యవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగాశేఖర్, మండలాధ్యక్షులు సుధామ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు ఎ.దత్తాత్రి, కౌన్సిలర్ రావుల.పోశెట్టి, గణపతి, చంటి, రాజు, శేఖర్ తదితరులు ఉన్నారు.

కేంద్రాల్లోని ధాన్యం వెంటనే తరలించాలి



తడిసిన ధాన్యం వద్ద జెడ్పీటీసీ జానుబాయి

ఖానాపూర్: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని మస్కాపూర్ తోపాటు పలు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం పరిశీలించి మాట్లాడారు. అధికారుల వైఫల్యం కారణంగా పంట తడిసిపోయి అన్నదాతలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం డబ్బులను అధికారులు రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడంతో వానాకాలం సాగు పనులు ప్రారంభించే పరిస్థితి లేదన్నారు.చిలుకూరి తిరుమలగిరి, ఎనుముల స్వామి, పుప్పాల ఉపేందర్ ఉన్నారు.

బడిబాట

కుంటాల: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని సర్పంచ్ సమత పేర్కొన్నారు. శుక్రవారం కుంటాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అందించే వసతులను వివరించారు. ప్రధానోపాధ్యాయుడు సక్కరపు గజేందర్, గ్రామపెద్ద వెంకటేశ్, ఉపాధ్యాయులు, వెంకట్‌రావు, పుష్పలత, విద్యావలంటీర్ రాజు పాల్గొన్నారు.

ప్లాస్మా దానం చేసిన ఎంపీపీ

ఖానాపూర్: నియోజకవర్గంలోని ఉట్నూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ప్లాస్మా అత్యవసరం కావడంతో సమాచారం అందుకున్న ఖానాపూర్ ఎంపీపీ మోహిద్ వెళ్లి ప్లాస్మా దానం చేశాడు. నిర్మల్‌లోని లైఫ్‌కేర్ బ్లడ్ సెంటర్‌లో ఉట్నూర్‌కు చెందిన ఓ వ్యక్తికి ప్లాస్మాను దానం చేశాడు. ఎంపీపీ గతంలోనూ పలువురికి రక్త దానం చేశారు. మానవత్వం చాటుతున్న ఎంపీపీని పలువురు అభినందించారు.

సంక్షిప్త వార్తలు

‘ఆహ్వానించకపోవడం సిగ్గుచేటు’

నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు బీసీ సంఘాలను ఆహ్వానించకపోవడం సిగ్గు చేటని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. అశోక్‌చారి, లక్ష్మీనారాయణ, జీవన్, కిషన్ తదితరులు ఉన్నారు.

ఎంపికైన విద్యార్థుల జాబితా ప్రదర్శన

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఇటీవల ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు పాఠశాలలో ఎంపికైన విద్యార్థుల వివరాలతో కూడిన జాబితాను శుక్రవారం ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అప్లికేషన్‌ఫామ్, ఆధార్, ఆన్‌లైన్‌లో మెమో ప్రింట్, కుల, ఆదాయం, నివాస, బోనఫైడ్, టీసీతో పాటు పాస్ ఫొటోను ఈనెల 12 నుంచి 17 వరకు పాఠశాలలో అందించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

అన్ని వృత్తులకు వర్తింపజేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: బీసీ కులవృత్తులకు అందించే ఆర్థిక సాయం పథకాన్ని కేవలం 15 వృత్తుల వారికే కాకుండా అన్ని వృత్తులకు వర్తింపజేయాలని బీజేపీ నాయకులు అప్క గజేందర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీసీభవన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్ పారదర్శకంగా లబ్ధిదారులకు ఎంపిక చేయాలని కోరారు. వెనుకబడ్డ బీసీ కుటుంబాలకు బీసీబంధు ఇవ్వాలన్నారు.

అర్హులకు ‘డబుల్’ ఇళ్లు కేటాయించాలి



ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

కడెం: అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని టీపీసీసీ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దూర్ సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల వేళ పేదలందరికీ ఇళ్లను ఇస్తామని చెప్పి సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరమ్మ పథకం ద్వారా ఎందరికో గూడు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించారని గుర్తు చేశారు. 15 రోజుల్లో ఇళ్ల పంపిణీ చేయకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినోద్ నాయక్, రహీం, సలీం, సత్యంచారి, భూషణం, తదితరులు ఉన్నారు.